# మరో ప్రపంచం

రచన!
శ్రీమతి పసల సీతారత్నమాంబ.

మరో పట్నము, పల్లెటూరు కాని ఊరది. ఆవూరి చివరలో మారుమూల సందు ఆ సందులో అన్నీ పూరిళ్ళే. ఆ ఇళ్ళలో ఒకటి చంద్రయ్య అనే బీద ముసలాడిది, చంద్రయ్యకు కావల్సిన వాళ్లెవరూ లేరు. లేరంటె అసలు లేరని కాదు, బెల్లమున్నప్పుడే చీమలు చేరుతాయన్న సామెతను ఋజువు చేశారు. ప్రస్తుతం చంద్రయ్య పెనగ గుగ్గిళ్ళు అమ్ముకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. ఒక పూట తింటూ-మరోపూట పస్తుంటూ ఎలానో కాలాన్ని నెట్టుకొస్తున్నాడు.

ఉన్నట్లుండి చంద్రయ్యకు జ్వరంచ్చింది. మంచంలో నుండి లేవలేని పరిసితి ఏర్పడింది. చంద్రయ్య మనస్సులో చెప్పరాని బాధ చోటుచేసుకుంది. తను చచ్చిపోతాడని మాత్రం కాదు. కాస్త జ్వరానికే మనుషులుచనిపోతే దేశ జనాభా సులువుగా తగ్గేది. కుటుంబ నియంత్రణ కేంద్రాలు పనిచేయకుండా సరిపోతుంది. ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేయకుండా ఆహార సమస్య తీరుతుంది.

చంద్రయ్య కేదో కోరిక తీర్చుకోవాలనే ఆశ, ఆరాటం తనకోరిక తీరకుండానే చనిపోతానేమో అన్న నిస్పృహ తాలూకు బాధ!

ఎలాగయిన కోరిక తీర్చుకోవాలన్న పట్టుదల తాలూకు ఆ వీధిలో ఉన్న ఆయుర్వేద వైద్యుడు పేరయ్య ఏదో మందిస్తున్నాడు, అయినా చంద్రయ్యకు చెప్పరాని ఆ వేదని తనకోరిక తీరుతుందా? లోకం దృష్టిలో తనకోరిక చాల చిన్నది కావచ్చు. అయినా తనదృష్టిలో చాల విలువైనది.

ఎన్నికలు దగ్గరకొస్తున్నాయి, తను జ్వరంలో ఉంటే తన ఓటు మురిగిపోతుందేమో నన్నబాధ! తన ఓటు మురిగిపోతే నాయకులకు మాత్రంబాధకదూ! చంద్రయ్య ఆలోచన నిండా ఓట్లు, ఎన్నికలు ఇవే!!

* * * *

ఓట్లు.........ఓట్లు.........ఓట్లు

ఎవరినోట విన్నా ఎలక్షన్ల గోలే......

ఏ గోడమీద చూచినా ప్రకటలే......

ఎవరిచేతుల్లో చూచినా కరపత్రాలె - చదువుకున్నవారు, చదువులేనివారు, పిల్లలు పెద్దలు అనే భేధం లేకుండా అందరు చర్చించుకుంటున్నారు, మంగలిషాపు దగ్గర్నుండి, పెద్దహోటళ్ళ సైతం ఎన్నికలగురించి చర్చలే!

ఏ పేపర్లో చూసినా దయచేసి మీ పవిత్ర ఓట్లు... ఓటరు మహాశయులు...అనే సంబోధనలే! ఏ వీధిలో చూసినా గల,గలా(వి) నాయకుల అభ్యర్ధనలే...ఎక్కడ చూసిన ఒలికే సందడి. అంతకు ముందు ఇరుకు సందుల అడుగుపెట్టటానికి అసహ్యించుకొనే పెద్దలు, ముఖ్యులు మాకువని గ్రామాభివృద్ధికి తోడ్పతామని చెప్తున్నారు. విటులొస్తుంటే, అలంకరించుకునే వేశ్యలాగ తయారౌతున్నాయి రోడ్లు.

దయచేసి మీ ఓట్లు మాకివ్వండి. మీ సహకారం లేనిదే పైకి రాలేము. ప్రజాసేవే మాధ్యేయం. కేవలం మీ సేవకోసమే! మేము పోటీ చేస్తున్నాం. దయచేసి మీ ఆదరాభిమానాలతో మమ్ములను గెలిపించ ప్రార్ధన అంటూ ఉపన్యాసాలిస్తున్నారు.

ఒకరికంటె ఒకరు ఓట్లు విలువ పెంచుతున్నారు. ఆ సందులో అందరినీ అడిగినట్లే చంద్రయ్యను ఓటు అడిగారు. వాగ్దానాలు చేశారు. అవసరానికిచెప్పే వాగ్దానాలకి, అవసరం తీరాక చేసే పనులు, చంద్రయ్యకు బాగా అనుభవం. పైకి ఏమీ అనలేకపోయినా మనస్సులో చెప్పరాని అసహ్యం.

అందరూ మీకే ఓటువేస్తామని అంటున్నారు.

అలాగే చంద్రయ్య చెప్పాడు.

ఎలక్షన్స దగ్గర పడుతున్నకొద్దీ నాయకుల వాగ్దానాలెక్కువయ్యాయి.

చంద్రయ్యకు జ్వరం తగ్గుముఖం పట్టలేదు.

ఎలక్షన్స్ రేపనగా లౌడు స్పీకర్లలో చెప్పడం ఆగిపోయింది.

చాటు, చాటు ప్రచారాలు ప్రారంభమయాయి.

* * * *

తెల్లవారింది. చంద్రయ్యకుజ్వరం తగ్గుముఖం పట్టింది. కాని నీరసం తగ్గలేదు. ఓటర్లకోసం వాహనాలు పంపుతున్నారు అభ్యర్థులు. ఎక్కడ ఓటర్లుంటే అక్కడకు వాహనాలు పరుగెత్తుతున్నాయి. కొంతమంది సంబరంగా వాహనాలు ఎక్కి వెళ్తున్నారు. కొంతమంది అభిమానమున్నవాళ్లు నడిచే వెళ్తున్నారు. మధ్యాహ్నానికి చంద్రయ్య దగ్గరకుకూడా వచ్చారు వాహనాలవాళ్లు. ఎక్కమంటే, ఎక్కమని ఒత్తిడిచేశారు. చంద్రయ్య మనస్సు వాహనాలు ఎక్కటానికి ఇష్టపడలేదు కాని శరీరం ఎదురు తిరిగింది. హాయిగా వాహనాన్ని ఎక్క ఎక్కమని బతిమాలాడారు అందరు. గత్యంతరంలేక, చంద్రయ్య వాహనాన్ని ఎక్కి పోలింగ్ బూత్ దగ్గరకు వెళ్ళాడు. పోలింగ్ బూత్ దగ్గర ఇసుక వేస్తే రాలనట్లుగా ఉన్నారు జనం.

చంద్రయ్యను దిగు దిగు అంటూ దించారు. 'తాత గారు మా సైకిలు గుర్తుంది చూశారా దానికే వేయండి మీ ఓటు' అంటూ బొట్టు సవరించుకున్నాడు ఒక ఆసామి. అతన్ని నెట్టుకుంటూ ఒక నేరో ఫేంట్ కుర్రాడు 'తాత గారు ఇదిగో పక్షి గుర్తుకే మీ ఓటు వేయండి' అన్నాడు. 'తాత గారు ఈ రాట్నం గుర్తుకే మీ పవిత్రమైన ఓటు వేయండి' ఖద్దరు చీర, జాకెట్టు వేసుకున్న ఒక మహిళ అభ్యర్థన. వీరందరిని దాటుకుంటూ ముందుకు వెళ్ళాడు. ఒకళ్ళు చేయి పట్టుకున్నారు. మరొకరు దారిచూపారు. ఇంకెవరో ఎండగావుందని గొడుగు పట్టుకున్నారుపాపం. ఎవరికి వారు మనకే ఓటు వస్తుందని తృప్తిగా వెళ్ళి పోయారు!

* * * *

చంద్రయ్య ఓటు వేసి మెల్లిగా బయటకు వచ్చాడు తృప్తిగా! ఏదో కోరిక తీరిందన్న సంతోషం, జ్వరం తాలూకు నీరసం. చంద్రయ్యని ఉక్కిరి బిక్కిరిచేశాయి. ఎలక్షన్ అయిపోయాక ఫలితాలకోసం ఎదురుచూస్తున్నారు అందరూ! చంద్రయ్య ముసలాడితో వాళ్ళ కింక అవసరమేముంది, చంద్రయ్య మెల్లిగా పోలింగ్ బూత్ దాటి, రోడ్డు దాటిపోతున్నాడు. జ్వరంవల్ల వచ్చిన నీరసంతో రోడ్డు మధ్యలో పడ్డాడు. రయ్యిన లారీదూసుకు పోయింది. చంద్రయ్య కాళ్లు చేతులువిరిగి ఎడ మెడంగా పడిపోయాయి—డ్రైవరు, రోడ్డు మధ్య నడిచే ముసలాయనదే తప్పని తనదారిన పోయాడు. లారీ వస్తుందో లేదో చూసుకుని నడవద్దు సాగతీశాడు సైకిలు గుర్తుకే ఓటువేయమన్న పెద్దమనిషి. 'అంత నడవలేని ముసిలాడు ఓటువేయటానికి రాకపోతేనేం. ఈఒక్క ఓటుతోనే అభ్యర్థులకు మెజారిటీ వస్తుందా' రాట్నం గుర్తుకే ఓటు వేయమన్న మహిళ సలహా! 'పోలేపోనీయ్ లెద్దూ జనభా సంఖ్య తగ్గుతుంది' పక్షి గుర్తుకి ఓటు వేయమన్న నేరో పాంట్ కుర్రాడి మాటలు. చంద్రయ్యకు ఇక్కడ కొన ఊపిరి కొట్టుకుంటుంది. ఆఖరి శ్వాస విడిచే ముందు వీరందరి వంక ఒక్కసారి చూశాయి చంద్రయ్య కళ్లు. వీళ్ళ మాటలకు చంద్రయ్యకు, ఈ ప్రపంచం మీద అసహ్యమేసింది. కొన్ని నిమిషాలలో ఎంత వ్యత్యాసం.

ఓటు వేయటానికి చెయ్యిపట్టుకున్నవాళ్లు గొడుగు పట్టినవాళ్ళు దారిచూపినవాళ్ళు తేనెల్లాంటిమాటలుచెప్పిన వాళ్ళు ఒకళ్ళైనా 'అయ్యో' అనలేదు. అవసరం తీరిపోయిందిగా........ఇంకతను వాళ్ళ కేమీ ఉపయోగపడడు.

ప్రతి మనిషి తన స్వార్ధానికి ఉపయోగించుకుంటాడు. చంద్రయ్యకు వీళ్లందరిమీద అసహ్యం, ప్రపంచం మీదే విరక్తి వేసింది. 'ఈ లోకంలో అంతా స్వార్థపరులు రా, మరో ప్రపంచానికి రా' అంటూ ఆహ్వానించింది మృత్యు దేవత. ఈ స్వార్థ ప్రపంచం, కుళ్లు ప్రపంచం నుండి పైకి పైపైకి ఎగిరిపోయింది చంద్రయ్య ఆత్మ!

(6వ పేజీ తరువాయి)

ఇంతలో ఇంజనీరుగారి అత్తగారు వచ్చి బాబుని అమాంతం సరోజ వడిలోంచి తీసుకునిపోయిందిచొక్కా మార్చాలన్న నెపంతో.

ఇంజనీరుగారి భార్యకు పరిస్థితి అర్థంకాక, తల్లితో పాటు తనూ వెళ్ళింది లోపలకు...సరోజ ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది!

కూతుర్ని చూడగానే తల్లి 'ఓరి వెర్రి మొగమా' నీకేమైనా మతిపోయిందా? ఆ గొడ్రాలిచేతికి పిల్లని ఇచ్చావు! ఇంకేమయినా ఉందా! ఉండు దిష్టి తీస్తాను అంటోంది ఆమె ఎంత నెమ్మదిగా అన్నా ఆ మాటలు సరోజ చెవిలో పడ్డాయి. తాంబూలం తీసుకుని ఎలాగో యిల్లు చేరింది. 'గొడ్రాలు' అన్నపదం చెవుల్లో గింగురుమంటోంది. భరించలేనిబాధ...అణుకోలేని ఆవేదన...అయ్యింది. 'హృదయానికి సూటిగా తగిలిన ఆ మాట'...దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది. సరోజ......

రాజారావు! వస్తూనే కంగారు పడ్డాడు. 'ఏమిటి సరూ! ఏమి జరిగింది.' అంటూ వాచిన ఆమె కళ్లను చూస్తూ...అతన్ని బల్లి కరచుకున్నట్లు మరింత కరచుకు పోయి బావురుమంది సరోజ.

ఆమెని ఎలా ఓదార్చాలో అర్థం కాని పరిస్థితిలో అలాగే ఉండిపోయాడు రాజారావు.

కొంచెము నిదానించిన తరువాత జరిగిన సంగతి క్లుప్తంగా చెప్పింది సరోజ... అంతా విన్న రాజారావు. 'సరూ,...నీకు నిజంగా మతిపోయింది. ఎవరో ఏదో అన్నారని బాధపడడం అవివేకం......అలాంటి వారు అనే మాటలు పట్టించుకోకూడదు.' అన్నాడు అనునయంగా;...ఆ రాత్రి సరోజా కలత నిద్రపోయింది.

ఆ మరునాడు ఒక వార్త మోసుకొచ్చింది కాంతమ్మ. 'ఎవరో ఆ ఊరికి ఒక యోగిని వచ్చిందట. ఆమె అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్తుందిట. ఆమె హస్తవాసి కూడా మంచిదిట. ఆవిడ చేతిలో తీర్థము తీసుకున్న వారికి తమ కోర్కెలు, సిద్ధిస్తాయట. ఇది నాకు తెలిసిన వివరములు'. అని ముగించింది.

ఈ విషయం విన్న జగదాంబ, సరోజా, ఇద్దరూ ఆనందించారు. నాలుగురోజుల అనంతరం ఒకరోజు ఉదయాన్ని